## రిలయన్స్ మార్ట్‌లో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

-ఫంగస్ వచ్చిన పన్నీర్ అమ్మిన విషయంలో రూ.30వేల జరిమానా

**హుస్నాబాద్ రూరల్, జూలై 26, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో గల రిలయన్స్ మార్ట్‌లో కొద్ది రోజుల క్రితం పట్టణానికి చెందిన నన్నె శ్రీనివాస్ అనే వ్యక్తి అమూల్ కంపనీకి చెందిన 200ల గ్రాముల పన్నీరు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి చూసేసరికి అందులో మొత్తం ఫంగస్ ఉండడంతో ఈవిషయంలో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తోపాటు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయగా శనివారం స్పందించిన మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ ఆదేశాలమేరకు ఇంచార్జ్ మేనేజర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తినుబండారాలతో పాటు విక్రయిస్తున్న సామగ్రికి సంబంధించిన ప్యాకెట్లపై గడువు తేదీలను పరిశీలించారు. అనంతరం ఫంగస్ వచ్చిన పన్నీర్ అమ్మిన విషయంలో మార్ట్‌కు రూ.30వేల జరిమానా విధించి రశీదును మార్ట్ మేనేజరుకు అందజేశారు. తనిఖీలుచేసిన వారిలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, ఇంచార్జ్ ఆర్ఐ ప్రసాద్, శంకర్‌తోపాటు తదితరులు ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి

-ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి అధికారి డాక్టర్ శరత్

**హత్నూర, జూలై 26, ప్రభాతవార్త:**

రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి అధికారి శరత్ అన్నారు. శనివారం ఆయన హత్నూర మండలం దౌల్తాబాద్ లోని ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఆయన వెంట ఉన్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ను ఆదేశించారు. ఎరువుల దుకాణంలోని రికార్డులను, స్టాకును స్టాక్బో బోర్డును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏడిఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ కె.హైమావతి




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా ఆయా గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో భూభారతి ప్రత్యేక అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కారం కోసం శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భూభారతి చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను భూభారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు సదానందం, చంద్రకళ పాల్గొన్నారు.

## మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలించిన కలెక్టర్



మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 26, ప్రభాతవార్త:**

సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువును జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఆకస్మికంగా సందర్శించారు. భారీవర్షాల కారణంగా నిండుకుంటున్న చెరువును కలెక్టర్ పరిశీలించారు. చెరువు తూమును, అలుగును కలెక్టర్ పరిశీలించారు. చెరువు నిండితే వరద వచ్చే ప్రాంతాలను గుర్తించి 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువు పైభాగంలో ఎక్కడైనా ఇళ్లలోకి నీరు వస్తే వెంటనే సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు కూడా ముందుజాగ్రత సూచనలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను, నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన జాగ్రతలు తీసుకోవాలి. ప్రతిరోజు చెరువు నీటిమట్టాన్ని పరిశీలించి రిపోర్టు సమర్పించాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలలో ఇళ్లలో ఉన్న ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట నీటి పారుదలశాఖ డిఈ బాలగణేష్, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జయరామ్, పట్టణ సిఐ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదు

-ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడిజిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్

**గజ్వేల్, జూలై 26, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్, జిల్లా అదనపుకలెక్టర్లతోపాటు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మెదక్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ జిల్లా అధికారులను ఆదేశించారు. గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి జిల్లా అధికారులతో వానాకాలం సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ మాట్లాడుతూ భారీ వర్షాలు వరదలు పట్ల ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టంజరగకుండా ప్రజలను అప్రమత్తంచేస్తూ పటిష్టకార్యాచరణ ద్వారా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. పురాతన ఇళ్లు పడిపోయే ప్రమాదం ఉంటుందని అలాంటి ఇళ్లలో నివసించే వారిని గుర్తించి ఖాళీ చేయించి పునరావాస కేంద్రాల ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని ఇప్పటికే జిల్లాలో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఎలాంటి కొరత లేదన్నారు. వ్యవసాయ అధికారితో పాటు ఇన్స్పెక్టర్ స్థాయిలో ఫర్టిలైజర్ షాపులపై నిఘా ఉంచాలన్నారు. రాష్ట్రంలో 25శాతం యూరియాను వ్యవసాయేతర కార్యక్రమంలో వినియోగిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని జిల్లాలో యూరియా పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో ఫర్టిలైజర్‌షాపులను తనిఖీచేసి స్టాక్‌వివరాలను తెలుసుకుని రైతులకు సరిపడా యూరియా అందేలాచూడాలన్నారు. గురుకులాలను, పాఠశాలలను హాస్టళ్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యతతోకూడిన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో జిల్లా అదనపుకలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఎస్ఓ తనూజ, సివిల్ సప్లైయి డిఎం ప్రవీణ్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ముస్లింలు

**నారాయణఖేడ్, జూలై 26, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణానికి చెందిన ముస్లింలు పలు సమస్యల, పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పట్టణంలో షాదిఖానా, ఈద్గా, కబ్రస్తాన్ గురించి ఎమ్మెల్యేతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితోపాటు పట్లోళ్ల చంద్రశేకర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్, తాహెర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పండరిరెడ్డి, మాజీ ఎంపిటిసి, మోహినిద్దిన్, యాధుల్ ఖురేషి, గఫ్ఫార్, గౌస్ చిస్థి, వాజిద్, రషీద్, యూసుఫ్, షరీఫ్ పట్టణానికి చెందిన ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నంతో కలిసి పని చేస్తా

✷నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేస్తాం ✷హుస్నాబాద్‌లో సైనిక్, నవోదయ పాఠశాలల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం
✷విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి ✷చదువులో విద్యార్థులు అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి
✷విద్యార్థులకు సైకిళ్ల పంపిణీలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, జూలై 26, ప్రభాతవార్త:**

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాజకీయాలు చేయబోమని కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ అన్నారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలో రాజకీయాలు చేయబోమని, ఈప్రాంత అభివృద్ధి విషయంలో ఈప్రాంత ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ఇద్దరం కలిసి ఇక్కడ నవోదయ, సైనిక్ పాఠశాలలు త్వరలోనే ఏర్పాటుచేసి వచ్చే విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్లాస్టిక్‌ను నిర్మూలించడం కోసం హుస్నాబాద్‌లో స్టీల్‌బ్యాంక్ ఏర్పాటుచేయడం అభినందనీయమైన విషయమన్నారు. ప్రతి ప్రజాప్రతినిధి సమాజానికి తమవంతు ఏదో ఒక కార్యక్రమం చేపట్టాలని కోరారు. దేశ ప్రధానమంత్రి మోడీని స్ఫూర్తిగా తీసుకుని మోడీకానుక పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందిస్తుండడం తనకు సంతోషంగా ఉందన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేయడంతో పాటు ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మొదటి ఆస్తి వారు పంపిణీచేసే సైకిల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పదవ తరగతి విద్యార్థికి ఇది మొదలుకుని ప్రతి సంవత్సరం సైకిళ్లు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లాను చూస్తే తనకు సంతోషం అనిపిస్తుందని ఇక్కడ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ అందరూ మహిళలేనని ఈ అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతివిద్యార్థి ఉన్నత లక్ష్యసాధనకు ప్రయత్నించాలన్నారు. చదువు విషయంలో ప్రతి విద్యార్థి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.

**విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్రం...**

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మోడీ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని బండి సంజయ్ అన్నారు. అందులోభాగంగానే యుపిఎ హయాంలో 2014, 15వ బడ్జెట్‌లో విద్యారంగానికి కేంద్రం 68వేల 728కోట్లు మాత్రమే కేటాయిస్తే, మోడీ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే 1లక్షా 28వేల 650కోట్లు కేటాయించిందని, అంటే యుపిఎతో పోలిస్తే విద్యారంగానికి రెట్టింపు నిధులు పెరిగాయన్నారు.

**రాజకీయాలకు అతీతంగా పని చేస్తాం...**

ఎంపిగా నన్ను, ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్‌లను గెలిపించిన ఈప్రాంత అభివృద్ధికి ఇద్దరం కలిసి రాజకీయాలకు అతీతంగా పని చేస్తున్నామని, ఇటీవల ఢిల్లీకి వచ్చిన పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో నవోదయ పాఠశాల కావాలని కోరారని, సైనిక్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు అందించిన సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఈ సైకిళ్లను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఆనాడు వాజ్‌పేయి, ఈనాడు నరేంద్రమోడీ పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిన విషయాలను గుర్తుచేశారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే: కలెక్టర్**

సిద్దిపేట కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ పిల్లలు తెల్లపేపర్‌లాంటి వారని రాగద్వేషాలుండవని, వాళ్లకు మనం ఏం నేర్పిస్తే అదే నేర్చుకుంటారని అలాంటి విద్యార్థులకు ఉన్నత ఆశయాలు నెరవేర్చుకునే దిశగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. తల్లితండ్రులు తమపిల్లలపై ఎక్కువ ఆశలు పెట్టుకోవద్దని, వారికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే అదేరంగంలో ఎదిగేందుకు వారికి సహాయ సహకారాలు అందించాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్డీవో రాంమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మండల విద్యాశాఖ అధికారి బండారు మనీలతోపాటు తదితరులు ఉన్నారు.

## రైతు సేవాకేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

-అగ్రోస్ రైతు సేవాకేంద్రం-1 ఆకస్మిక తనిఖీ



రైతు సేవాకేంద్రాన్ని తనిఖీచేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**గజ్వేల్ టౌన్, జూలై 26, ప్రభాతవార్త:**

గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ అగ్రోస్ రైతు సేవా కేంద్రం-1ను జిల్లా కలెక్టర్ కె.హైమావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్, సెల్ రిజిస్టర్‌లను పరిశీలించి రిజిస్టర్‌లో రైతులకు అందించే ఎరువుల వివరాలు రాయడంలో పలు సూచనలు చేశారు. రైతులకు భూమి సాగుచేసే ప్రకారమే ఎరువులు అందించాలన్నారు. అక్రమంగా ఇచ్చిన వారికే అధికంగా ఎరువులు ఇవ్వడం మూలంగా మొత్తానికే ఎరువులు రానివారికి నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, ఎఓ తదితరులు ఉన్నారు.

## ఇసుక డంప్‌ల స్వాధీనం... ముగ్గురిపై కేసు నమోదు

'వార్త కథనానికి స్పందన'



ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్న దృశ్యం

**బెజ్జంకి, జూలై 26, ప్రభాతవార్త:**

అక్రమ ఇసుక రవాణాలో కలెక్టర్, సిపిల ఆదేశాలు బేఖాతర్ అనే శీర్షికతో ఈనెల 26న ప్రచురణ జరిగిన వార్త కథనానికి ఎస్ఐ సౌజన్య, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించారు. మండల పరిధిలోని వీరాపూర్, తోటపల్లి గ్రామ శివారులలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలపై శనివారం దాడులు నిర్వహించారు. వీరాపూర్‌లో 80 టన్నులు, తోటపల్లిలో 50 టన్నుల ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరాపూర్ శివారులో అక్రమంగా డంప్ చేసిన 80టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తోటపల్లి శివారులో కె.అనిల్ అక్రమంగా నిల్వ చేసిన 40టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే అదే గ్రామంలో రాజయ్య అనే వ్యక్తి 10టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వ చేయడంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణాచేస్తే చర్యలు తప్పవన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్స్ 8712667445, 8712667447చ 8712667446 నంబర్లుకు సమాచారం అందించాలన్నారు.

# సైనికుల పాత్ర మరువలేనిది

-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
-సంగారెడ్డిలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 26, ప్రభాతవార్త:**

మన దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో సైనికుల పాత్ర మరువలేనిదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శనివారం సంగారెడ్డిజిల్లా విశ్రాంత సైనికుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పి పరితోష్ పంకజ్‌లు హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పి పరితోష్‌పంకజ్‌లు జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ... భవిష్యత్తు తరాలకు దేశభక్తిని పెంపొందించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో మన సైనికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా ప్రతి ఏటా జూలై 26 వ తేదీన కార్గిల్ విజయ్‌దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. దేశభద్రత విషయంలో మనదేశ సైనికులు ఎక్కడా రాజీపడకుండా ఎన్నోత్యాగాలు చేసి దేశ పరిరక్షణలో భాగస్వాములు అవుతున్నారన్నారు. అలాంటి మహనీయుల గూర్చి భవిష్యత్తు తరాలకు తెలియజేప్పాడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ లాంటి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ఈసందర్భంగా కలెక్టర్ సూచించారు. ఎస్పి పరితోష్‌పంకజ్ మాట్లాడుతూ... సరిహద్దుల్లో సైనికులు చేస్తున్న త్యాగాల ఫలితంగానే మనం ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. దేశసేవకోసం సైనికులుచేస్తున్న త్యాగాలు వెల కట్టలేనివని సైనికుల త్యాగాలను గుర్తు చేసుకోవడం కోసం విజయ్‌దివస్‌ను నిర్వహించడంజరుగుతుందనిఅన్నారు. సైనికులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు దేశ భద్రత కోసం పాటుపడాలని దేశభక్తిని విద్యార్థి దశ నుంచి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వంత్ సైనిక సంక్షేమ సంఘం నాయకులు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## ఎండు గంజాయి, అక్రమ మద్యం స్వాధీనం



అక్రమ రవాణాదారులను అరెస్టుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

**మునిపల్లి, జూలై 26, ప్రభాతవార్త:**

మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ ఆదేశాల మేరకు మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కలసి వాహన తనిఖీలు చేపట్టగా 501గ్రాముల ఎండుగంజాయి, 3.30లీటర్ల సుంకం చెల్లించని అక్రమమద్యం లభించింది. ఈవాహనతనిఖీలో లంగర్‌హౌస్‌కు చెందిన కంచె రాకేష్, నాంపల్లి శుభం, ధర్మరాజు, సాయికుమార్, పోరంపల్లి శ్రీకాంత్ అక్రమంగా ఎండుగంజాయిని ఆటోలో బీదర్ నుండి సరఫరా చేస్తుండగా అదుపులోకితీసుకుని, వారివద్దనుండి 501గ్రాముల ఎండుగంజాయిని, ఒక స్కూటీ, నాలుగు మొబైల్ ఫోన్స్‌ను స్వాధీనపరచుకుని ఎక్సైజ్ స్టేషన్‌కి తరలించారు. అదేవిధంగా గోవా నుండి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుండంగా వివిధ బ్రాండ్‌లకి సంబంధించిన 3.30లీటర్ల సుంకం చెల్లించని మద్యం స్వాధీనపరుచుకొని తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్‌స్టేషన్ సంగారెడ్డికి తరలిచారు. ఈదాడులలో టీం సిఐ శంకర్, చంద్రశేఖర్, ఎస్సైలు హనుమంతు, అనుదీప్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిడిపిఓగా ఉద్యోగం సాధించిన యువతి

-రాష్ట్ర మంత్రి సీతక్క నియామకపత్రం అందజేత



మంత్రి సీతక్క నుండి నియామకపత్రం అందుకుంటున్న అలేఖ్య

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 26, ప్రభాతవార్త:**

రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన మాసాయిపేట అలేఖ్య సిడిపిఓగా ఉద్యోగం సాధించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట సిడిపిఓగా నియమిస్తూ మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అలేఖ్య సిడిపిఓగా ఉద్యోగం సాధించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. గ్రామంలోని వారు అలేఖ్యను అభినందించారు.

## సంగారెడ్డి డిఎం అండ్ హెచ్‌వోగా నాగలక్ష్మి



కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన నాగలక్ష్మి

**సంగారెడ్డి టౌన్, జూలై 26, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ నాగ నిర్మల నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. జిల్లాకలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి..

**పావన్నపేట, జూలై 26, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం పాపన్నపేట మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిటీ సభ్యులు భీమ్లా, జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, భూషణం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల్లో ఇస్తామన్నా పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, రిటైర్డ్ అవుతున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజునే అన్ని చెల్లింపులు చేయాలని, జిపిఎఫ్, టిఎస్‌జిఎల్ఐ బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ నాయకులు శ్రవణ్, నాయుడు, రఫీక్, పవన్ పాల్గొన్నారు.

## సిద్దిపేట వాసి కొండ అశోక్‌కుమార్‌కు డాక్టరేట్ పట్టా

**సిద్దిపేట అర్బన్, జూలై 26, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన కొండ అశోక్‌కుమార్‌కు శనివారం ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ పట్టా లభించింది. హైదారాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆశోక్ విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ప్రశాంత్ సింగం సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ డిపార్టుమెంట్ ఉస్మానియా యూనివర్శిటీలో పరిశోధన చేశారు. మెలిక్యులర్ క్లోనింగ్,ఇన్సిలికో క్యారెక్టరైజేషన్ అండ్ ఎక్స్ప్రెషన్ అనాలసిస్ అఫ్ స్నాక్-1 ఎన్కోడింగ్ జీన ఆఫ్ జియా మేస్ ఫర్ డ్రాట్ స్ట్రెస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్శిటీ కొండా అశోక్‌కుమార్‌కు డాక్టరేట్ పట్టా ప్రధానం చేసింది. డాక్టర్ పట్టా పొందిన అశోక్‌కుమార్‌ను హెచ్‌వోడి ప్రొ॥ సురేఖరాణి, డాక్టర్ సుమలత, డాక్టర్ విజయ్, బయోటెక్నాలజీ సిబ్బంది, మిత్రులు తదితరులు అభినందించారు.

## నిలువ నీడ లేదు ఇందిరమ్మ ఇల్లయినా ఇవ్వండి

**-మైసమ్మవాగు తండా మాజీ సర్పంచ్ లావణ్య**

**హుస్నాబాద్ రూరల్, జూలై 26, ప్రభాతవార్త:**
నిలువ నీడ లేక రోడ్డున పడ్డాం కనీసం ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆదుకోండని వేడుకుంటున్నారు అక్కన్నపేట మండలంలోని మైసమ్మవాగు తండా తాజామాజీ సర్పంచ్ లావణ్య. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా మాజీ సర్పంచ్ లావణ్య పదవిలో ఉన్నప్పుడు ప్రభుత్వం నుండి బిల్లులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాకపోవడంతో ఉన్న రెండు ఎకరాలను అమ్ముకుని రోడ్డున పడ్డామని, అయినా మరికొన్ని అప్పులు అలాగే మిగిలి పోయాయని, ఆ తరణంలోనే వారి ఇల్లుకూడా కూలిపోయిందని, దాంతో కుందనవాణిపల్లిలోని ఒక ఇంట్లో కిరాయికి ఉంటుండగా ఆ ఇంటి యజమాని ఇటీవల విద్యుత్‌షాక్‌తో మరణించడంతో ఆ ఇంటి యజమానులు కూడా ఇల్లు కాళీ చేయాలని ఆదేశించడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో వారి గ్రామంలో మూత పడి ఉన్న పాఠశాలకు వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నారు. ఇందిరమ్మ ఇల్లు కావాలని ఎంపిడివొకు దరఖాస్తు చేసుకుంటే కాంగ్రెస్ నాయకుల వద్దకు వెళ్లి అడుగమని అంటున్నారని, ఐదేళ్ల గ్రామానికి నిస్వార్థంగా సేవ చేసి ఉన్న ఆస్తులకు కోల్పోయి, అప్పుల పాలయిన తమకే ఇందిరమ్మ ఇల్లు కేటాయించమని నాయకులకు దగ్గరకు తిరగాల్సి న దుస్థితి నెలకొందని వాపోయారు. నిలువ నీడ లేక అనుమతి తీసుకుని మూతపడిన పాఠశాలలో ఉంటుంటే ఆ పాఠశాల నుండి కూడా ఇప్పుడు ఉపాధ్యాయులు కాళీ చేయాలని అంటున్నారని శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా ఇప్పించాలని కోరుకుంటున్నారు.

## ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు...



గాంధారిపల్లిలో ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

**పావన్నపేట, జూలై 26, ప్రభాతవార్త :**
వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని గాంధారివల్లిలో ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలు నాటారు. ఈ సంధర్బంగా సీఐ నాగేశ్వర్‌రావు మాట్లాడుతు చెట్లతోనే మానవ మనుగడ అన్న విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు.వర్షాకాలం మొక్కలు నాటేందుకు అనువైన కాలమన్నారు. ఈత మొక్కలు గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తాయిని చెప్పారు.కార్యక్రమంలో ఎస్సై మాన్‌సింగ్, కానిస్టేబుళ్ళు వెంకటేశ్, నరేశ్, సురేష్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్న జిల్లా అధికారులు

**కొండపాక, జూలై 19, ప్రభాతవార్త:**
వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం దుద్దెడ శివారులోని కలెక్టరేట్‌లో ప్లాంటేషన్‌లో భాగంగా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ (లోకల్ బాడి), అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), డిపిఒ దేవకిదేవి, డిఆర్‌డిఒ జయదేవ్ అర్య, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ప్లాంటేషన్ మేనేజర్, ఎపిఒ, టిఎ, ఎఫ్ఎ కిషయ్య, పంచాయతి కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొని మొక్కలునాటారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంవల్ల వాతావరణ కాలుష్యం నివారించవచ్చునన్నారు.

## ఈనెల 28న కెజిబివిలో అడ్మిషన్లు

**మర్కుక్, జూలై 26, ప్రభాతవార్త:**
మండలకేంద్రం మర్కుక్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో ఈనెల 28సోమవారం ఇంటర్మీడియెట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినిలు 28వ తేదీన కస్తూర్బాగాంధీ కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**-రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

**హుస్నాబాద్ రూరల్, జూలై 26, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణ కేంద్రంలో పలు వీదుల గుండా నడుచుకుంటూ డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. గోదాంగడ్డనుండి రెడ్డికాలనీ వరకు రోడ్డును పరిశీలించి రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం నాలుగవ వార్డులోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పనులను మంత్రి స్వయంగా పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఏ విధంగా పనులు జరుగుతుంటే ఆవిధంగా బిల్లులు ఇప్పిస్తానని కావున నిర్మాణం వేగవంతంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వచ్చిన మంత్రికి లబ్దిదారులు ఇండ్లకు ఇసుక దొరకడం లేదని చెప్పడంతో ఇసుకకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుంటూ ఇసుక పక్కదారి పట్టకుండా నేరుగా లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండోచైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌తోపాటు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న నారింజ నీళ్లను అరికట్టాలి

**-ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం**



నారింజ ప్రాజెక్టును పరిశీలస్తున్న వై.నరోత్తం

**జహీరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:**
మండలంలోని కొత్తూరు బి లో గల నారింజ ప్రాజెక్టు నుండి కర్ణాటక వైపుకు లీకేజీలై వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి నారింజ ప్రాజెక్టును పరిశీలించారు. ఈసందర్భంగా వై.నరోత్తం మాట్లాడుతూ వర్షాకాలం మొదటి వర్షానికే నారింజ పూర్తిగా నిండిపోయిందని, ప్రాజెక్టునుండి లీకైన నీరంతా కర్ణాటకకు వెళ్లిపోతున్నదన్నారు. ఈబ్యారేజ్‌కు 3000ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడియున్నదనీ కానీ ఉపయోగంలోకి ఎప్పుడ రాలేదన్నారు. గతంలో కాలువలు మరమ్మతుల కొరకు నిధులొచి టెండర్ అయిందన్నారు పనులు ప్రారంభిస్తామన్నారు కానీ ఇంతవరకు ప్రారంభించలేదని విమర్శించారు. వర్షం ప్రవాహానికి గేట్లపై నీరు ప్రవహిస్తుందన్నారు..ఈ ప్రాజెక్టు వలన చుట్టు ప్రక్కల సుమారు 14 గ్రామాలలో భూగర్భ నీటి మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. నారింజ ఇక్కడి ప్రాంతంలోనే ఒక పెద్ద ప్రాజెక్టు అని ఈప్రాజెక్టులోకి చుట్టుప్రక్కలగల పారిశ్రామిక కలుషిత కర్మాగారాల ముఖ్యంగా అల్లనా కాలుష్య జలాలను ఇందులో కలుపుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టి వృధాగా పోతున్న నీటిని, బ్యారేజ్ గేట్లను మరమ్మతులు చేసి కలుషిత నీటిని నారింజలో కలవనివ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.నర్సింలు, శికారి గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, చెంగల్ జైపాల్, శికారి శ్రీనివాస్, యం.జైపాల్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

**-కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, జూలై 26, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన పెద్దంగాల పోచయ్య ఈ మధ్యకాలంలో అనారోగ్యం వల్ల చనిపోవడం జరిగింది.ఈ విషయాన్ని తెలుసుకున్న నల్లవల్లి మాజీ ఎంపిటీసీ, బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్దన్ రెడ్డి, బాధిత కుటుంబానికి తమ వంతు ఆర్థిక సాయం అందించారు. ఈ సహాయాన్ని రాములమ్మ, కుమారుడు నవీన్ తాజా మాజీ సర్పంచ్ దోమదుగు శంకర్ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఆదుకున్న నాయకులను ఎప్పటికీ మర్చిపోలేమనీ కష్టకాలంలో ఆదుకున్న వళ్లే నిజమైన బంధువులు అవుతారని అన్నారు. ఈ సహాయం అందజేసిన నాయకులకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దంగాల మహేష్, సత్యనారాయణ, ఎర్రోల పోచయ్య, ఎర్రోల కొమురయ్య, దానోళ్ళ శివ రాములు, ఎర్రోల రాజు, కావాలి సాయి, పెద్దంగాల యాదగిరి పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో రైన్ డే సెలబ్రేషన్

**కొండాపూర్, జూలై 26, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చెర్ల గోపులారం ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రంలో శనివారం రైన్‌డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్వాడీ పిల్లలతో కలిసి పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్ అనసూయ పిల్లలతో వర్షంలో గొడుగులు పట్టించి వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. వర్షాల కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వాతావరణం మార్పులను గుర్తించి విధానాలపై పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. చిన్నారులు రంగురంగుల గొడుగులతో పాల్గొని కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించేదుకు, రక్షణ చర్యల పట్ల స్పష్టత కలిగించేందుకు తీసుకున్న ఈ ప్రయత్నం అభినందనీయం.

## ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఉమ్మడిజిల్లా ప్రత్యేక అధికారి సమీక్ష సమావేశం



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శరత్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం, ఉమ్మడి మెదక్‌జిల్లా ప్రత్యేక అధికారి శరత్, జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్యలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో భారీవర్షాలకారణంగా ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలపైనా చర్యలు, వ్యవసాయం, వర్షాకాలం సన్నద్ధత, ఎరువుల లభ్యత, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై ఆరోగ్యశాఖ పర్యవేక్షణ చర్యలు, నూతన రేషన్‌కార్డుల ధ్రువీకరణ, రేషన్ కార్డుల పంపిణీ, మూడు నెలల బియ్యం పంపిణీ వివరాలు, పాఠశాలలు, బాలికల వసతి గృహాల పరిశీలనకు సంబందించిన వివరాలు, పాఠశాలలు - వసతి గృహాల మధ్యాహ్న భోజన నాణ్యత, మౌలిక సదుపాయాలపై తదితర అంశాలపై ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి శరత్ విస్తృతంగా సమీక్షించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వికలాంగుల పెన్షన్ ఐదువేలకు పెంచాలి

**-ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 26, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ 300 నుండి 5000 లకు పెంచాలని,,ఎలాంటి షరతులు లేకుండా ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకం వికలాంగులందరికి వర్తింపచేయాలని కేంద్ర ప్రభుత్వం పై తెలంగాణ రాష్ట్ర ఎంపీ లకు ఒత్తిడి చేయాలని ఎన్ పి ఆర్ టి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యం బస్వరాజు, కార్యదర్శి కొనింటి నర్సిములు అన్నారు. శనివారం వారు సంగారెడ్డిలో మాట్లాడుతూ దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2.68 కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 16 శాతం మంది జనాభా ఉన్నారని అంచనా.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వైకల్య పెన్షన్ పథకం అమలు చేస్తుంది. 2012 సంవత్సరం నుండి రూ. 300 మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు.

## ముసురేసిన మేఘం.. మురిసిన ఘనపురం...



పొంగి పొర్లుతున్న ఘనపురం ఆనకట్ట

**పావన్నపేట, జూలై 26, ప్రభాతవార్త:**
ఘనపురం నీరు విడువండి మహాప్రభో అని వేడుకున్నా పాలకులు కనికరించలేదు....కానీ వరుణుడు కరుణించాడు. మూడు రోజులుగా ముసురేశాడు. వీడని వానతో వాగులు.. వంకలు పరుగులు తీస్తున్నాయి. ఘనపురం ప్రాజెక్టు పొంగి పొర్లుతుంది. ఫతేనహర్, మహబూబ్ నహర్ కెనాళ్ల గేట్లు ఎత్తారు. వరి నార్లు ముదిరి, చుక్కనీటి కోసం ఎదురు చూపులు చూస్తున్న రైతన్నలు వరుస వర్షాలతో మురిసి, వరి నాట్లు మొదలెట్టారు. వీడని వానలో సైతం నాట్లు వేస్తున్నారు. ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతుండటంతో ఖరీఫ్ వంటపై ఆశలు చిగురించాయి. ఆనకట్ట క్రింద ఉన్న సుమారు 20 వేల ఎకరాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి

**-సొంత నిధులతో ఏర్పాటు పట్ల గ్రామస్థుల హర్షం**



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆవుల రాజిరెడ్డి

**హత్నూర, జూలై 26, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన హత్నూరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను విద్యార్థులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో ప్రారంభించి కళాశాల ప్రిన్సిపాల్ కు అప్పగించారు. ఈసందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చామని అన్నారు. ఇప్పటికే కొన్ని కళాశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డితోపాటు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత....



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న దృశ్యం

**పావన్నపేట, జూలై 26, ప్రభాతవార్త:**
సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించిన ఏడు సెల్ ఫోన్లు రికవరీ చేసి వారికి అప్పగించినట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. వీటిని సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు తాము 300 కు పైచిలుకు సెల్ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. అయితే ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై సూచించారు. తమ సెల్ఫోన్లను ఎస్ఐ వెంటనే రికవరీ చేయడం పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

## వీడని వానలతో జాగ్రత్త...

**-ఎస్సై శ్రీనివాస్‌గౌడ్**

**పావన్నపేట, జూలై 26, ప్రభాతవార్త:**
వీడని వానలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మంజీరా నదికి వరదలు వస్తున్నందున పశువుల, కాపరులు, రైతులు, కూలీలు, ఇతరు లెవరు అటు వైపు వెళ్ళొద్దన్నారు. మస్య కారులు చేపల వేటకు వెళ్ల వద్దని చెప్పారు.వర్షం పడే సమయం లో విద్యుత్ స్తంభాల క్రింద నిలబడొద్దని, కరెంట్ వైర్లు ముట్టు కోవద్దని సూచించారు. వ్యవసాయ దారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా, స్టార్టర్ డబ్బులు, కేబుల్, సర్వీస్ వైర్లు ముట్టు కోవద్దని చెప్పారు.శిథిల మైన ఇళ్లలో ఉండొద్దన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే 100 నెంబర్‌కుగానీ, పోలీస్ స్టేషన్ గాని సమాచారం ఇవ్వాలని సూచించారు.

## దేశ రక్షణలో యువత ముందుండాలి....

**-రామాయంపేట ఎస్ఐ బాలరాజు..**

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 26, ప్రభాతవార్త:**
దేశరక్షణలో యువత ముందుండాలని రామాయంపేట ఎస్సై బాలరాజు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం యువకులు, ఆర్మీలో చేరాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం విరోచితంగా పోరాడి, పాకిస్థాన్ కు ముచ్చమటలు పట్టించిన యుద్ధ వీరులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోరాటంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించాలన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి రావాలన్నారు. దేశం కోసం ఎంతోమంది యువకులు సైన్యంలో చేరి దేశ సేవ కోసం పాటుపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో షానిషా ఫౌండేషన్ చైర్మన్ శివ, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ యాదగిరి, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు భాస్కర్, సత్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పితామహుడు సాహుమహరాజ్

**-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి**

**గజ్వేల్ టౌన్, జూలై 26, ప్రభాతవార్త:**
భారత సామాజిక ప్రజాస్వామ్య మూలస్థంభం, రిజర్వేషన్ల పితామహుడు, తొలి సామాజిక న్యాయోద్యమకారుడు ఛత్రపతి సాహుజిమహరాజ్ 151వ జయంతిని శనివారం డిబిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణులు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో దళిత బహుజనులను విముక్తి చేయడానికి సైద్ధాంతికంగా, పాలనాపరంగా మహాత్మ జ్యోతిబాపూలే, ఛత్రపతి శివాజీల వారసుడిగా కృషి చేసిన మహానీయుడు ఛత్రపతి సాహుమహారాజ్ అన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి**

**-జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ /సిద్దిపేట-3:

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సంక్షేమశాఖల వసతి గృహాల్లోని విద్యార్థులకు డైట్ ప్రకారం చపాతీ,పూరి, భోజనం సక్రమంగా అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం బిసి, ఎస్సీ సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లలో డైట్ ప్లాన్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వసతి గృహాల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ప్రభుత్వం నిర్ధారించిన విధంగా భోజనం, అల్పాహారం అందించాలన్నారు. ఎక్కడ కూడా విద్యార్థులను వంట పనులు చెప్పొదన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు మెడిసిన్ అందుబాటులో ఉంచాలన్నారు. రైస్ బాగా లేకపోతే వెంటనే తహసీల్దార్‌లకు తెలిపి మార్చుకోవాలన్నారు. స్టోర్ రూంలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి రోజు మెనూ ప్రకారం స్టాక్ రిజిస్టర్లను వార్డెన్లు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. సంబంధిత అధికారులు తరచు హాస్టళ్లను తనిఖీలు చేయాలన్నారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. హాస్టళ్లలో మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలని మేజర్ రిపేర్లు ఉంటే వివరాల నివేదికను అందించాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమశాఖల అధికారులు నాగరాజమ్మ, కవిత,వార్డెన్లు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్ సీజ్

**-కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న కోహెడ పోలీసులు**



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

**కోహెడ, జూలై 26, ప్రభాతవార్త**
మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో శనివారం రోజున అక్రమంగా డంప్ చేసిన 70 టన్నుల ఇసుకను టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూర్ మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన మామిడి లక్ష్మన్ అనే వ్యక్తి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేశాడని నమ్మదగిన సమాచారం మేరకు వచ్చి ఈ డంప్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. ఈ విషయంలో కోహెడ ఎస్ఐ అభిలాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ఇసుక, రేషన్ బియ్యం, జూదం ఆడడం గంజాయి విక్రయించడం, మట్టి అక్రమ రవాణా ఎవరు చేసినా, చేసినట్లు తెలిసినా 8712667445, 8712667447, 8712667446 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

